క్లుప్తంగా

గంగమ్మతల్లి సేవలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్ 12వ వార్డు రెడ్లబజారులో వేంచేసియున్న గంగమ్మ తల్లి అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి భూమిరెడ్డి కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో భారీ వ్యయంతో నిర్మించిన రామాలయంలో ప్రతిష్ఠించాల్సిన జీవ ధ్వజస్తంభానికి శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ నెల 7న ఉదయం 7.43 గంటలకు విగ్రహ, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుంది. శుక్రవారం ధ్వజస్తంభ నిర్మాణ పనులు పూర్తి కావటంతో ప్రత్యేక ట్రాక్టర్‌పై శనివారం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు లలితా సహస్ర నామ పారాయణం, బొప్పూడి వారిచే భజన కార్యక్రమం, అఖండ హరేనామ సంకీర్తన నిర్వహించనున్నారు. శనివారం ఉదయం నుంచి కెల్లంపల్లి వీరయ్య ధర్మసత్రం ఆవరణలో వేసిన యాగశాలలో హోమాలు ప్రారంభంకానున్నాయి. టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించనున్నారు. ప్రతిష్ఠా మహోత్సవానికి త్రిదండి చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రామనామ సంకీర్తనతో గ్రామ మార్మోగింది. భారీ అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

86 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక- సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ రెండో రోజు శుక్రవారం 86 శాతం పూర్తి చేశారు. మొత్తం 16 సచివాలయాల పరిధిలో 9274 మందికి గాను రూ.2,55,75,250లు పంపిణీ చేయాల్సి ఉంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలు అరికడతాం



ఎస్.సాంబశివరావు

వినుకొండ(నూజెండ్ల): శాంతిభద్రతలు కాపాడటమే కాకుండా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వినుకొండ టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.సాంబశివరావు వెల్లడించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతిభద్రతల కోసం పటిష్టమైన ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలిచ్చే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇప్పటికే 150 మంది మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. చుట్టుపక్కల జరిగే అసాంఘిక కార్యక్రమాలను, చట్ట వ్యతిరేక చర్యలను ప్రజలు పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు. జూదం, వ్యభిచారం, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దొంగతనాలు నివారించేందుకు రాత్రి వేళల్లో నిఘా పెంచినట్లు చెప్పారు. ఎవరైనా పనులపై ఊరికి వెళ్లినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బీజేపీ ఎంపీ రాజీనామా చేయాలి

రొంపిచర్ల: మహిళ రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక చెరువుగట్టు సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిమ్మరాజు మాట్లాడుతూ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్ మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. ఎంపీ వేధింపులకు నిరసనగా శాంతియుతంగా రాజధాని నిరసన తెలుపుతున్న రెజ్లర్లను పోలీసులు ఈడ్చుకెళ్లడం అమానుషమన్నారు. బ్రిజ్ భూషణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పసుమర్తి ఆదినారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పలపల రామిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉప్పలపాటి వెంకటేశ్వరు, పిడెం హుస్సేన్, టి. చిన తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వంకాయలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



వంకాయలపాడు లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రజినిని వైఎస్సార్ సీపీ నాయకులు 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా గ్రామంలోకి తరలివచ్చారు. గ్రామంలోని మసీదు ఎదురుగా ఉన్న వీధి నుంచి పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన ఆమెను తమ ఇంటి ఆడపడుచులా మహిళలు సాదరంగా ఆహ్వానించారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ చేకూరిన సంక్షేమ పథకాల వివరాలను తెలిపే కరపత్రాలను కుటుంబ సభ్యులకు అందిస్తూ.. వారిని చిరునవ్వుతో పలకరిస్తూ.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటూ కార్యక్రమాన్ని ముందుకు కొనసాగించారు. కార్యక్రమంలో మధ్యలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ ఖాదర్‌బాష బర్తడేను పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

విశ్వసనీయతకు ప్రతీక జగనన్న

మంత్రి రజిని మాట్లాడుతూ రాజకీయాల్లో ఏ నాయకుడైనా ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని.. అదే ప్రజల్లో విశ్వసనీయత పెంచుతుందన్నారు. అదే జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతానికి పైగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. నవరత్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని చెప్పారు. కుల, మత, వర్గ, పార్టీ వ్యత్యాసాలు చూడకుండా ఎంతో పారదర్శకంగా అందిస్తున్నామని వెల్లడించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సంతకాలు, సిఫార్సులు వంటివి లేకుండా అర్హులైన లబ్ధిదారుడి ఖాతాలకే నేరుగా నగదు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలో 600కు పైగా హామీలిచ్చి.. ఏ ఒక్కదానిని నెరవేర్చలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బూటకపు మాటలు, కాపీ చేసిన పథకాలతో ప్రజల్ని మళ్లీ మోసగించేందుకు చంద్రబాబును ప్రయత్నిస్తున్నారన్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన నాయకుడు ఎవరో తెలుసన్నారు. చంద్రబాబు ఎన్ని కాపీ పథకాలు ప్రకటించినా ఎవరూ నమ్మరని స్పష్టం చేశారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ఉన్నాయని, పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర సంక్షేమ రథసారధిని మరోసారి ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం వీరారెడ్డి, యడ్లపాడు వైస్ ఎంపీపీ షేక్ నాజులా, సొసైటీ డైరెక్టర్ బసెల శివరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, రాచమంటి చింతారావు, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, పార్టీ నాయకులు షేక్ ఖాదర్‌బాష, ఖాదర్‌మస్తాన్, అల్లాబక్షు, సుభాని, సయ్యద్ మస్తాన్‌వలి, వలి, మోధిన్‌బాష, బింజు సాంబశివరావు, హుస్సేన్, హజ్రత్‌వలి, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, శ్రీనివాసనాయక్, గౌస్‌సందాని, జాకీర్, షంషుజువా, మాదం శ్రీను, పల్లపు రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు

ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్



డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్

నరసరావుపేట రూరల్: డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక దిగుబడితో పాటు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రైతు షేక్ సాంబశివరావు సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను శుక్రవారం ఆయన సందర్శించారు. సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు, ఎదురవుతున్న ఇబ్బందులు, దిగుబడులపై రైతుతో మాట్లాడారు. ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తోటను సందర్శించి సలహాలు, సూచనలు అందజేస్తున్నారని రైతు సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ అత్యధిక సాంద్రతతో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ ట్రెల్లిసింగ్ విధానం చాలా బాగుందన్నారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. జిల్లాలో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ వివరాలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.జాన్‌బెన్ని కమిషనర్‌కు వివరించారు. డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్ ఆశాజనకంగా ఉందని రైతు సాంబశివరావు తెలిపారు. రైతులు ఈ పంటను సాగు చేయడం ద్వారా లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్, వీఏఏ హర్ష పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకోవాలి

చిలకలూరిపేట: రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఉద్యానశాఖ కమిషనర్ ఎస్.ఎస్.శ్రీధర్ చెప్పారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో రైతు గుడిపల్లి నాగభూషణం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న కూరగాయలు, పండ్ల తోటను శుక్రవారం పరిశీలించారు. ప్రకృతి సాగులో భాగంగా రైతు తయారు చేస్తున్న వివిధ రకాల కషాయాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. సోలార్ కోల్డ్ రూం, ఎద్దుల గానుగను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ప్రకృతి సాగుద్వారా పండించే పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వెల్లడించారు. ప్రకృతి సాగు చేస్తున్న రైతును అభినందించారు. జిల్లా ఉద్యాన అధికారి బీజే బెన్ని ఉద్యానశాఖ రైతుసంఘాలకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యాన అధికారి ఎస్.కిషోర్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.నాగవరద రాణి, గ్రామ ఉద్యాన సహాయకుడు పూర్ణ రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

రీసర్వే పనులపై నాలుగు గ్రామాల్లో సమీక్ష

జేసీ శ్యాంప్రసాద్



తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పనులపై సమీక్షిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నాదెండ్ల: రీసర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో రైతులకు హక్కుపత్రాలు అందించాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. నాలుగు గ్రామాలైన గణపవరం, సాతులూరు, ఇర్లపాడు, తూబాడు గ్రామాల్లో జరుగుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం పనులపై సమీక్షించారు. ఇచ్చిన గడువు 120 రోజుల్లో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ ఏఏ గ్రామాల్లో ఎంత శాతం నమోదు అయిందో అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూం ఆధునీకరణ పనులు పరిశీలించారు. జగనన్నకు చెబుదాం.. కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల్లో శనివారం నుంచి కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. శనివారం నాదెండ్లలోని రెండో సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ, 1వ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ నిర్వహించనున్నారు. 5వ తేదీన మధ్యాహ్నం 3-5 గంటల వరకూ ఎండుగుంపాలెం, 6న మధ్యాహ్నం చిరుమామిళ్లలో, 7న ఉదయం సంకురాత్రిపాడులో, సాయంత్రం గొరిజవోలు, 8వ తేదీన ఉదయం చందవరం, సాయంత్రం సాతులూరు-1లో 9వ తేదీన ఉదయం సాతులూరు-2, మధ్యాహ్నం కనపర్రులో, 12వ తేదీన సాయంత్రం ఇర్లపాడులో, 13న గణపవరం 1-2 సచివాలయాల్లో ఉదయం, 3-4 సచివాలయాల్లో సాయంత్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన కౌలు రైతులు గ్రామ సభలో దరఖాస్తు ఫారాలు అందించాలన్నారు.

గిరిజనేతరులను ఎస్టీల్లో చేర్చవద్దు

నకరికల్లు: గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేరిస్తే అసలైన ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని గిరిజన రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.కోటానాయక్ అన్నారు. జూన్ 4వ తేదీన నరసరావుపేటలోని సీపీఐ హాలులో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతు, ఒరియ తదితర గిరిజనేతరులను ఎస్టీల్లో చేర్చవద్దన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్టీలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే కొత్తవారిని ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

దోమల నియంత్రణ చేపట్టాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం

శావల్యాపురం: స్థానిక ఎస్సీ కాలనీలో మలేరియా మాసోత్సవాలు భాగంగా కాలనీవాసులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అలాగే మురుగుకాల్వలో మురుగునీరు నిల్వ ఉండటం దోమలు లార్వాలు ఉత్పత్తి చేస్తుందన్నారు. దోమకాటు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల ప్రబలుతాయన్నారు. దోమలు నియంత్రణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. మలేరియా సోకకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది పర్యవేక్షణలో ప్రజల్లో చైతన్యం పెంపొదించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బారావు, ఆరోగ్య సూపర్‌వైజరు ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, ఆశలు లత, నాగరత్నం, లీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు



ప్రదర్శనలో కళాజాత కళాకారులు

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో సామాజిక వన విభాగం పల్నాడు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి రమానాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో వారి పాత్రపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యవరణాన్ని పరిరక్షించడంలో పాలు పంచుకోవాలన్నారు. ఈ మేరకు గ్రామస్తులతో పర్యావరణం కోసం జీవన శైలిపై ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో రోజువారి జీవనశైలీలో సాధ్యమైనంతవరకు మార్పులు చేస్తానని, పర్యావరణ ప్రాముఖ్యత గురించి స్నేహితులకు, కుటుంబ సభ్యులకు నిరంతరం గుర్తుచేస్తానని, భూమిపై పర్యావరణ సానుకూలత ఎలా ప్రాభావితం చూపుతుందనేదానికి ఉదాహరణగా నేను పనిచేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై కళాజాత ప్రదర్శన

చిలకలూరిపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని గ్లోబల్ స్టూడెంట్ ఎవరనెస్ ఆర్గనైజేషన్ కళాకారులు స్పష్టం చేశారు. కాలుష్యనియంత్రణ మండలి రీజనల్ కార్యాలయం పర్యవేక్షణలో ఈ నెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాజాత కళాకారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలను తమ ప్రదర్శల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు.

వినుకొండలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్

తహసీల్దార్, హెల్త్ సెంటర్లలో వివరాల సేకరణ



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ

వినుకొండ టౌన్: జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ (శిక్షణ) కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ వినుకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఏపీఎన్‌జీవోస్ భవనంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా రెవెన్యూ శాఖ ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల నిర్వహణపై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామోదయం, భూముల రికార్డులను ఆన్‌లైన్ చేసే విధానాలతోపాటు పలు అంశాల నిర్వహణ తీరుపై ఆమె ఆరాతీశారు. సమావేశంలో వినుకొండ నియోజకవర్గ తహసీల్దార్‌లు పాల్గొన్నారు. అనంతరం వినుకొండ రూరల్ తిమ్మాయిపాలెం గ్రామంలోనున్న హెల్త్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఏటీఎం ధ్వంసం కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ కోటేశ్వరరావు

నకరికల్లు: ఏటీఎం ధ్వంసం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నకరికల్లులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇండియా- 1 ఏటీఎం ఉంది. మే 23, అర్ధరాత్రి స్థానిక ఎన్నెస్పీ కాలనీకి చెందిన అల్లం శివకృష్ణారెడ్డి, తన ఏటీఎం కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. డబ్బులు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లాడు. మరో 20 నిమిషాల వ్యవధిలోనే దుస్తులు మార్చుకొని వచ్చి గడ్డపలుగుతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేశాడు. నగదు రాకపోవడంతో శాటిలైట్ పరికరాన్ని ఎత్తుకెళ్లాడు. ఎస్ఐ పి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని నకరికల్లులోని ఎన్నెస్పీ కాలనీలో అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు. రోజుల వ్యవధిలో కేసును ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు.

కౌలు కార్డుతో మద్దతు ధరకు అమ్ముకోవచ్చు



మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

గోళ్ళపాడు(ముప్పాళ్ల): కౌలు కార్డు(పంట సాగు పత్రం)తో ప్రభుత్వం అందించే మద్దతు ధరకు పంటలను అమ్ముకోవచ్చని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. మండలంలోని గోళ్లపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లో కౌలు కార్డు మంజూరుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ భవానీశంకర్ మాట్లాడుతూ పంటలకు మార్కెట్‌లో ధర సరిగ్గా లేనప్పుడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఆర్బీకేలో అమ్ముకోవచ్చన్నారు. సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా వర్తిస్తుందన్నారు. భూయజమానికి, సాగుదారునికి మధ్య ఉండే ఒప్పందం పత్రం మాత్రమేనన్నారు. భూయజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయా గ్రామసభల్లో సర్పంచులు గోపుఅప్పమ్మ, మోర్తాల వెంకటరమణారెడ్డి, ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పెదకూరపాడు: మండలంలోని గారపాడు బీసీ కాలనీ శివారులో పేకాటాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. ముందస్తు సమాచారంతో ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేయగా పది మందిని పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.5,150, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ప్రతిష్టా మహోత్సవాలు



వినుకొండలో నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గల రావి చెట్టు వద్ద శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు చేపడతామని, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుంకర శ్రీనివాసరావు, అడపాల రామయ్య, సోము కోటేశ్వరరావు, రామిదేవి ఆంజనేయులు, కొలిశెట్టి నాగేశ్వరరావు, మేకపోతుల దుర్గారెడ్డి, గుంట కొండారెడ్డి, సుంకర నాగేశ్వరరావు, జె.సాయి, చింతల రామయ్య, పసుపులేటి వెంకటేశ్వర్లు కోలా వెంకటేశ్వర్లు, మున్నంగి నాయుడు, కారుపల్లి నాసరయ్య పాల్గొన్నారు.

ముంద్రువారిపాలెంలో నేడు..

శావల్యాపురం: మండలంలోని ముంద్రువారిపాలెం గ్రామంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత స్వామి ఆలయంలో శిలా విగ్రహాలు, ధ్వజస్తంభం, బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ వేడుకలు నేడు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు దాతలు సహకారంతో సుమారు రూ. కోటి రూపాయల వ్యయంతో నూతన దేవాలయం ప్రతిష్ఠ ఉదయం 8.గంటలకు ఆగమ సిద్ధాంతి దివి జ్యోతిర్మయి కుప్పయ్య సారథ్యంలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరం

సత్తెనపల్లి: పలక పట్టాల్సిన వయసులో చిన్నారులను పనులు చేపించి బాల కార్మికులుగా మారిస్తే అది చట్ట రీత్యా నేరమని, ఆ సంస్థల యజమానులపై కేసులు నమోదు చేస్తారని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు పట్టణంలోని 23వ వార్డులోని వెంకటపతి కాలనీలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత ఒక టీంలా ఏర్పడి ఆ ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులను వారి పిల్లలు ఏఏ స్కూళ్లో విద్యనభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయ వాదులు లక్ష్మణ్, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, పారా లీగల్ వలంటీర్లు షేక్ ఖాజా, షేక్ ముబారక్, ఆ వార్డు సచివాలయ సిబ్బంది ఆనంద్ లు పాల్గొన్నారు.

గోరంట్ల గ్రామంలో....

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. శుక్రవారం సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఐసీడీఎస్, సేవే ప్రాణం సేవే జీవితం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పిల్లలను జీరో నుంచి ఐదు సంవత్సరాల లోపల పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లో చేర్పించాలని, ఐదు సంవత్సరాల పైబడిన వారిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం యల్లమంద, నాగేశ్వరరావు, సుశీల చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు బిస్కెట్స్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నందిగామ సుశీల, సేవే ప్రాణం సేవ జీవితం సర్వీస్ సొసైటీ అధ్యక్షులు నందిగామ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ యల్లమంద పాల్గొన్నారు.